నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 నిజామాబాద్, శుక్రవారం 28 జూన్ 2024 KAMAREDDY

# ప్రాచీన కట్టడాల పరిరక్షణ అభినందనీయం

కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠం చెబుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, జూన్ 27: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాచీన కట్టడాల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న బావిని ఆయన గురువారం సందర్శించారు. నాగన్న బావిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నాగన్న బావి వరకు ఫార్మేషన్ రోడ్డును ఉపాధి హామీ పథకంలో భాగంగా వేయించాలని అధికారులకు సూచించారు. రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని, బావి వద్ద హైమాస్ట్ లైట్లు, రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులని ఆదేశించారు. నాగన్న బావిలో పూడికతీయడంతో భూగర్భ జలాలు పెంపొందినట్లు తెలిపారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన జితేశ్ వీ పాటిల్ సహకారంతో నాగన్న బావి పునరుద్ధరణ పనులు చేపట్టిన తీరును ఇన్ఫోసిస్ వైస్ చైర్మన్ కల్పనారమేశ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం బోధించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్.. నిల్వ ఉన్న మందుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. దవాఖానలో అందిస్తున్న సేవలను డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. దవాఖాన ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణకుమార్‌ని ఆదేశించారు. కలెక్టర్ వెంట లింగంపేట ఎంపీపీ గరీబున్నీసా బేగం, ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్, పంచాయతీ రాజ్ డీఈ గిరి, వ్యవసాయ శాఖ ఏడీఏ వీరస్వామి, ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి హిమబిందు, ఏపీఎం శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్, ఏపీవో అన్నపూర్ణ, పీఆర్ ఏఈ రాకేశ్ తదితరులు ఉన్నారు.



నాగన్న బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అధికార పార్టీకి చెందిన స్థలం ఇదే..

- డబ్బులకు కక్కుర్తిపడి సిగ్గుమాలిన పనులు
- వెనుకాముందు పరిశీలన లేకుండానే రిజిస్ట్రేషన్లు
- కబ్జారాయుళ్లతో అంటకాగుతూ సామాన్యులకు చేటు
- తాజాగా కాంగ్రెస్ పార్టీ ఉదంతంతో వెలుగులోకి లీలలు
- సస్పెన్షన్ వేటు పడుతున్నా దారిలోకి రాని సబ్‌రిజిస్ట్రార్లు

## పైసలిస్తే ఏదైనా
# రిజిస్ట్రేషన్




నిజామాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొంత మంది సబ్‌రిజిస్ట్రార్ల ధనదాహం నిజామాబాద్ జిల్లా పరువును మంట కలుపుతున్నది. పైసలకు కక్కుర్తి పడుతున్న సబ్ రిజిస్ట్రార్లతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అడ్డదారిలో నకిలీ రిజిస్ట్రేషన్లు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఆస్తికి పూచీగా నిలవాల్సిన ప్రభుత్వ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి మాయాజాలానికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమి అన్న తేడా లేకుండానే ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఏడాది కాలంలోనే అక్రమ వ్యవహారాలతో ఏకంగా ముగ్గురు అధికారులపై వేటు పడినప్పటికీ తీరు మారకపోవడం విడ్డూరంగా మారింది. జిల్లా కేంద్రంలోనే జరిగిన ఈ తంతు మరువకముందే ఏకంగా అధికార పార్టీకి చెందిన స్థలాన్ని సైతం ఓ సబ్ రిజిస్ట్రార్ అప్పనంగా పేరు మార్పిడి చేసేయడం విస్తుగొల్పుతున్నది. వెనుకాముందు ఆలోచించకుండా, రికార్డులను పరిశీలన చేయకుండానే కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థలాన్ని కట్టబెట్టడం ఇప్పుడు దుమారం రేపుతున్నది. అధికార పార్టీకి చెందిన స్థలానికే భద్రత లేకపోవడంతో సామాన్యుల ఆస్తికి లెక్కా పత్రమే లేకుండా పోయిందన్న వాదన ఇప్పుడు బలంగా వినిపిస్తున్నది.



Registration & Stamps Department

STATEMENT OF ENCUMBRANCE ON PROPERTY

### అరకోటి జాగకు ఎసరు..

నిజామాబాద్ నగరంలోని శంభుని గుడి వెనుకాల కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ కార్యకలాపాల కోసం 75గజాల విలువైన స్థలం ఉంది. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు పెట్టుకొని వ్యాపారాలు చేసుకుంటున్నారు. మడిగెలకు కిరాయిని కాంగ్రెస్ పార్టీకి చెల్లిస్తున్నారు. అధికార పార్టీకి సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలన్నీ రైల్వేస్టేషన్ సమీపంలోని డీసీసీ ఆఫీసులోనే జరుగుతుండడంతో అటువైపు నాయకులు పట్టించుకోవడం మానేశారు. దీంతో రంగంలోకి దిగిన అక్రమార్కులు ఎలాగైనా ఈ స్థలాన్ని కాజేసేందుకు స్కెచ్ వేసి అడ్డంగా దొరికిపోయారు. దశాబ్దాలుగా 8–4–359/1 ఇంటి నంబర్‌తో ఉన్న స్థలం కాంగ్రెస్ పార్టీ పేరిట ఉన్నది. మొత్తం ఎనిమిది మడిగెలకు ఇంటి నంబర్లు ఉండగా ఒక మడిగె కింద 43.65 గజాల భూమిని అక్రమార్కులు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మహ్మద్ యూసుఫ్ అనే వ్యక్తి మహ్మద్ మాజిద్‌కు అమ్ముతున్నట్లుగా సేల్‌డీడ్ రాసుకున్నారు. యూసుఫ్ మరణించడంతో పాషా, రిజ్వాన బేగం అనే మహిళ మహ్మద్ మాజిద్‌కు 43.65 గజాల స్థలాన్ని అమ్మినట్లుగా మే 6వ తేదీనాడు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేరిట ఉన్న ఈ స్థలానికి యూసుఫ్ ఎలా వారసుడిగా మారాడు. ఇతని చనిపోవడంతో రంగంలోకి మరికొంత మంది వ్యక్తులు ఎలా వచ్చారు. రికార్డులు సరి చూసుకోకుండానే పేరు మార్పిడీని ఎలా బదలాయించారు అన్నది పాలకవర్గంలోని నేతలకే అంతు చిక్కడం లేదు.

### తెగబడుతున్న సబ్ రిజిస్ట్రార్లు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ ప్రాంతాల్లో శాఖాపరమైన చర్యలు అధికారుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడం లేదు. అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ దొడ్డిదారిలో జేబులు నింపుకొనేందుకు అలవాటు పడిన వారంతా యథాలాపంగా అడ్డదారిని వదలడం లేదు. 2022లో భీమ్‌గల్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ సస్పెన్షన్‌కు గురి కావడం ఉమ్మడి జిల్లాల్లో చర్చనీయాంశమైంది. ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడడం, నాన్ లేఅవుట్ దస్తావేజులకు రిజిస్ట్రేషన్లు చేయడంతో విధుల నుంచి తొలగించారు. భీమ్‌గల్‌లో ఏడాదిన్నరగా ప్రవీణ్ చేసిన బాగోతాలపై వచ్చిన ఫిర్యాదులపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖకు చెందిన డీఐజీ స్థాయి అధికారి విచారణ చేశారు. తప్పు నిజమేనని తేలడంతో పక్కన పెట్టారు. ఇదే ఏడాదిలో నిజామాబాద్‌లో ముగ్గురు రిజిస్ట్రేషన్ అధికారులపై వేటు పడింది. కబ్జాగాళ్లతో చేతులు కలిపి వివాదాస్పద భూములను రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో చర్యలు తీసుకున్నా మార్పు రావడంలేదు. ఇప్పుడేకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆస్తిని అదే నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ హోదాలోని వ్యక్తి అప్పనంగా అంటగట్టడం ముక్కున వేలేసుకునేలా చేసింది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ తీరు మరోసారి తేటతెల్లమైంది. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో మొత్తంగా అధికార పార్టీ పరువు మంట కలిసినట్లయ్యింది. నష్టనివారణ చర్యల్లో భాగంగా జిల్లాకు చెందిన హస్తం నేతలు రంగంలోకి దిగి పోలీస్ కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. సుమారుగా రూ.అరకోటికి పైగా విలువ చేసే ఈ మడిగెను తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# భర్తకు వాతలు పెట్టిన భార్య

- పడుకున్నాక బంధించి సురుకులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

వినాయక్‌నగర్, జూన్ 27: నిద్రలో ఉన్న భర్తను బంధించి వాతలు పెట్టిందో భార్య. తాగొచ్చిన ఇంటాయనను కట్టేసి కాళ్లు, చేతులు, ముఖానికి సురుకులు పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి కథనం ప్రకారం.. నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్‌కు చెందిన మహేశ్‌కు, మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన సుమలతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్లంబర్‌గా పని చేసే మహేశ్‌కు కొద్దిగా తాగే అలవాటు ఉంది. అయితే, నాలుగు రోజుల క్రితం పనికి వెళ్లి వచ్చిన అతడు రాత్రి నిద్రకు ఉపక్రమించాడు. కాసేపటికే భార్య సుమలత అతని కాళ్లు, చేతులు కట్టేసి, ఇనుప రాడ్డును కాల్చి కాళ్లు, చేతులు, ముఖంపై వాతలు పెట్టింది. ఆ మంటలకు తాళలేక మహేశ్ గట్టిగా అరవడంతో భార్య పిల్లలను తీసుకుని పారిపోయింది. తర్వాతి రోజు బాధితుడు ఆరోటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాలుగు రోజులైనా పోలీసులు చర్యలు తీసుకోవట్లేదని వాపోయాడు.



మహేశ్ చేతులపై భార్య పెట్టిన వాతలు

# షుగర్ ఫ్యాక్టరీని త్వరగా పునరుద్ధరించాలి

శక్కర్‌నగర్, జూన్ 27: నిజాం చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం జాప్యం లేకుండా పునరుద్ధరించాలని కార్మిక సంఘ నాయకులు అన్నారు. బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ఎన్ఎస్ఎఫ్ మెయిన్ గేటు ఎదుట కార్మిక సంఘం నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు ఫ్యాక్టరీ పునరుద్ధరణ విషయమై చర్చించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరించేందుకు కమిటీ వేసిన ప్రభుత్వం.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేతన బకాయిల చెల్లింపు విషయమై ఆలోచించాలన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు ఉపేందర్, రవిశంకర్‌గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు తదితరులు ఉన్నారు.

# అటవీ జాగా.. వేసేయ్ పాగా..

యథేచ్ఛగా ఫారెస్ట్ భూముల్లో పంటల సాగు

- చోద్యం చూస్తున్న అధికారులు
- గాంధారి మండలంలో వేల ఎకరాల అటవీ భూమి ఆక్రమణ
- హరితహారం ప్లాంటేషన్లతోపాటు కోతుల ఆహారశాలలు సైతం కబ్జా

గాంధారి, జూన్ 27: అటవీ భూమి కనబడితే చాలు.. అందులో పాగా వేస్తున్నారు గాంధారి మండలంలోని పలు గ్రామాల ప్రజలు. అధికారుల నిర్లక్ష్యంతో విలువైన అటవీ ప్రాంతం మాయమైపోతున్నది. కనుమరుగవుతున్న అడవుల్లో తిరిగి చెట్లను పెంచడం కోసం కేసీఆర్‌ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి హరితహారంలో భాగంగా మొక్కలను నాటించినప్పటికీ.. అక్కడ పలువురు దున్ని భూమిని కబ్జా చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గాంధారి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సుమారు 20వేల ఎకరాల అటవీ భూమి ఉన్నది. మండల కేంద్రంతో పాటు గ్రామాలను ఆనుకొని ఉన్న ఫారెస్టు భూములను యథేచ్ఛగా దున్ని ఆక్రమిస్తున్నా.. అధికారులు దానిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. మరోవైపు అధికారులు మామూళ్లు తీసుకుంటూ.. అటవీ భూముల్లో సాగుచేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

**ఇష్టానుసారంగా పంటల సాగు..**

అటవీభూములను ఇష్టానుసారంగా దున్ని పంటలను సాగుచేస్తున్నారు. గాంధారితోపాటు అటవీప్రాంతాన్ని ఆనుకొని ఉన్న చద్మల్, నాగ్లూర్, నేరల్‌తండా, దుర్గం, సోమారం తండా, కొత్తాబాది తండా, జెమినీ తండా, చందానాయక్ తండా, బీర్మల్, గుజ్జుల్, ముదెల్లి, గౌరారం, గండివేట్, సీతాయిపల్లి, చెన్నాపూర్, మేడిపల్లి, పొతంగల్, పేట్‌సంగెం, తిప్పారం, గొల్లాడితండా సమీపంలోని వందలాది ఎకరాల్లో అడవుల్లోని చెట్లను నరికివేశారు. ఆ ప్రాంతాన్ని దున్ని మక్కజొన్న, సోయా పంటలను సాగుచేస్తున్నారు. అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**నాటిన మొక్కలు మాయం..**

గత ప్రభుత్వ పాలనలో హరితహారంలో భాగంగా అటవీశాఖ అధికారులు మండలంలోని ముదెల్లి, గౌరారం, బూర్గుల్, నాగ్లూర్ తదితర గ్రామాల్లోని అటవీభూముల్లో మొక్కలు నాటారు. ఆ మొక్కలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడంలేదు. కారణం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మొక్కలను సంరక్షించకపోవడమే. కోతుల ఆహార కొరతను తీర్చడం కోసం ఏర్పాటు చేసిన ఆహారశాలను సైతం ఆక్రమణదారులు వదలడం లేదు.

**నరికినోడికి నరికినంత భూమి..**

గాంధారి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చద్మల్, నేరల్, నాగ్లూర్, యాచారం, దుర్గం అటవీప్రాంతాల్లో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. కొన్నేండ్లుగా అడవులను నరికి భూములను ఆక్రమిస్తున్నారు. తమ కుటుంబసభ్యుల బలం, తమ పలుకుబడిని ఉపయోగించి ఎంతంటే.. అంత అడవిని నరుకుతూ.. ఫారెస్ట్ భూమిని కబ్జా చేస్తున్నారు. పలు తండాల్లోని పెద్ద మనుషులు ఒక్కొక్కరు 50 నుంచి వంద ఎకరాల వరకు ఫారెస్ట్ భూమిని కబ్జా చేసి పంటలను సాగుచేస్తున్నట్లు సమాచారం. దీనికితోడు ప్రభుత్వం ఇచ్చిన పోడు భూముల పట్టాలను ఆసరాగా చేసుకొని కొత్తగా అటవీ భూముల్లో సాగుచేస్తున్నారు.

**కబ్జాల వైపు కన్నెత్తి చూడని అధికారులు..**

అటవీభూములను కబ్జా చేసి పంటలను సాగుచేస్తున్నా.. అటువైపు వెళ్లాలంటేనే అధికారులు జంకుతున్నారు. కారణం గతంలో అధికారులు వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. 15ఏండ్లుగా భూములను సాగుచేస్తున్న తమను ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని పలువురు అధికారులపై తిరుగబడుతున్నారు. భూములను కబ్జా చేస్తున్న వారు ఎంతటికైనా తెగిస్తారనే భయంతో ఫారెస్ట్ అధికారులు అటువైపునకు వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**ఫారెస్ట్ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవు**

అటవీభూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గాంధారి రేంజ్ పరిధిలో 36వేల ఎకరాల అటవీ భూమి ఉండగా.. 2019 వరకు 18 వేల నుంచి 19 వేల ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. గాంధారి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీభూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి 2010లో 900ఎకరాలకు సంబంధించి పట్టాలు ఇవ్వగా, 2023లో 4600 మందికి పట్టాలను ప్రభుత్వం అందజేసింది. అటవీభూమిని ఆక్రమిస్తున్న వారి వివరాలు సేకరించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

**- హిమచందన, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి, గాంధారి**



గాంధారిలో కోతుల ఆహారశాలలో మొక్కలు నాటుతున్న కూలీలు(ఫైల్ ఫొటో)



గాంధారి గ్రామశివారులోని అటవీ భూమిలో దుక్కులు దున్నిన దృశ్యం

# నిరంతర విద్యుత్‌తో.. పదేండ్లు పండుగ

- కేసీఆర్ కృషితో నాణ్యమైన కరెంటు
- రాత్రిపూట పొలాలకు వెళ్లే బాధ తీర్చిండు
- చిరువ్యాపారుల కరెంటు ఇక్కట్లు తొలగించిండు




'సమైక్య పాలనలో అరకొర విద్యుత్తుతో ఆగమైనం. రాష్ట్రం రాకముందు కరెంటు కోతలతో ఇబ్బందులు పడ్డాం. రెండు, మూడు గంటల కరెంటుతో పనులు సక్కగ నడ్వకపోతుండే. కేసీఆర్ వచ్చినంక పదేండ్లు నిరంతర విద్యుత్తుతో పండుగలా ఎవుసం చేసుకున్నం. చిన్న వ్యాపారులు, దుకాణాదారులు, మెకానిక్‌లకు మంచిగ పని దొరికింది. రాష్ట్రాన్ని విద్యుత్తు సమస్యలు లేకుండా తీర్చిదిద్దిన కేసీఆర్ సారుపై నిందలేయడం సరికాదు..' అని ప్రజలు తమ మనోగతాన్ని పంచుకున్నారు.

**కేసీఆర్ కరెంటు ఇబ్బందులు తీర్చిండు..**



కేసీఆర్ పాలనలో కరెంటు కోతలు లేవు. మీసేవ అప్లికేషన్లు, జిరాక్స్ తీయడం వంటి పనులు ఆగకుండా చేసేవాళ్లం. 24గంటల కరెంటుతో ఇబ్బందులు లేకుండా ఉండేది. మీసేవకు వచ్చే కస్టమర్లు కూడా ఇబ్బంది పడకుండా ఏ సమయంలోనైనా వచ్చి పనులు చేయించుకొని వెళ్లేవాళ్లు. సమయం వృథా కాకుండా పనులు ఎక్కువ చేసి ప్రజలకు ఎల్లప్పుడూ సేవలందించేవాళ్లం.

**- శేఖర్, మీసేవ నిర్వాహకుడు, రుద్రూర్**

**పట్టుదలతో 24 గంటల కరెంటు ఇచ్చిండు..**



కేసీఆర్ తీసుకొచ్చిన అనేక సంస్కరణలతో విద్యుత్తు వ్యవస్థ మెరుగుపడింది. ఆయన పట్టుదలతో 24గంటలపాటు కరెంటు ఇచ్చిండు. దీంతో గ్రామాల్లో చిన్న వ్యాపారులు, దుకాణాదారులు, మెకానిక్‌లకు మంచిగా పని దొరికింది. అలుపు లేకుండా పని ఉండేది. సీజన్ ఉన్నా లేకపోయినా పనులు మాత్రం బాగా ఉండేవి. అంత పనులు ఉన్నా కేసీఆర్ హయాంలో 24గంటల కరెంటుతో ఇబ్బంది లేకుండా పనులు తొందరగా పూర్తి చేసుకునేవాళ్లం. మంచి చేసిన కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు.

**వెల్డర్ పవన్‌చారి, లైట్‌మిషన్ ఆపరేటర్**

**రైతులకు తిప్పలు లేకుండా చేసిండు..**

రుద్రూర్, జూన్ 27: కరెంటు అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటేనే కరెంటు... ఎందుకంటే ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన 24గంటల కరెంటు ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. ఇవ్వరేమోకూడా. నేను దాదాపు 10ఎకరాల భూమిని కౌలుకు చేస్తా. ఇంత కౌలుకు చేస్తున్న అంటే కూడా రాత్రి పూట వెళ్లి బోరు వేయలేదు. రోజంతా కరెంటు ఉంటే రాత్రివేళలో బోరు ఆన్ చేసి పొలం పారించాల్సిన అవసరం రాలేదు. కేసీఆర్ రాకమునుపు కరెంటు ఎప్పుడొస్తదా అని ఎదురుచూస్తూ ఉండేవాళ్లం. రాత్రి టైంల పొలానికి పోతే కరెంటు షాక్, పాము కాట్లకు గురయ్యేవాళ్లం. రైతులకు ఆ తిప్పలు లేకుండా చేసింది కేసీఆరే.



**-రాజయ్య, రైతు**